క్లుప్తంగా

ఉపాధి పనుల కల్పనే ధ్యేయం

చీరాల టౌన్: వలసలను నిర్మూలించి ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దాసు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తోటవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామ పంచాయతీలో సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి పనుల సంఖ్య పెంపుదలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనులు ఎక్కువగా గుర్తించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. గ్రామాల నుంచి ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్ కార్డు అందించి పనులకు వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్తడబ్బాలు వినియోగించుకోవాలి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో నివాసం ఉండే ప్రతి ఒక్కరూ డస్ట్‌బిన్లను వినియోగిస్తూ చెత్తను పంచాయతీ ట్రాక్టర్లకే అందించాలని పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీ సూచించారు. శుక్రవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు చెత్తనుంచి సంపద కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. పంచాయతీల అధికారులు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఇళ్ల మధ్య చెత్తకుప్పలు లేకుండా చెత్త నుంచి సంపద కేంద్రాలను సక్రమంగా వినియోగిస్తే గ్రామ పంచాయతీలు ఆర్థికంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అంగట్లో.. అంగన్‌వాడీ కొలువులు

- అర్హులైన అభ్యర్థులకు తప్పని నిరాశ
- పచ్చ పార్టీ నేతల సిఫార్సులకు ప్రాధాన్యత
- రూ. 2 నుంచి రూ. 3 లక్షలకు బేరాలు
- నాయకులు, అధికారుల కుమ్మక్కు


వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రధాన కార్యాలయం

వేటపాలెం: కూటమి ప్రభుత్వం వస్తే ఏదో చేస్తుందిలే అనుకున్నారు ప్రజలు. కాని ఇక్కడ అలాంటిదేమి జరగకపోవడంతో ప్రజలు ఎందుకు ఓటు వేశామా అని బాధపడుతున్నారు. సాక్షాత్తు కూటమి సీఎం చంద్రబాబు నాయుడు ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ 'సూపర్ సిక్స్ పథకాలు హామీ ఇచ్చాం.. పరిస్థితి చూస్తుంటే భయం వేస్తోంది' అని నిరుత్సాహంగా మాట్లడారు. ప్రమాణ స్వీకారం చేసింది మొదలు నేటివరకు ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదు. అంతేకాదు అప్పటి నుంచి ఇప్పటి వరకు వసూళ్లలో మునిగి తేలుతున్నారు. ఇసుకలో దోపిడి, మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు, ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు, పారిశుద్ధ్య కార్మికుల తొలగింపు, ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో చేతివాటం, రేషన్ డీలర్లపై ఒతిడి తెచ్చి తమ పచ్చతమ్ముళ్లకు కేటాయింపు ఇలా ఒకటేమి అందినకాడికి దోచుకుంటూ పరిపాలన సాగిస్తోంది కూటమి ప్రభుత్వం. ఆఖరుకు అంగన్‌వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను సైతం అమ్ముకోవడానికి తెరతీసింది. బాపట్ల జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగాలు అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. బతుకుదెరువు కోసం మహిళలు వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల వస్తాయని ఆశపడి మరి దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే ఇప్పటికే స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఉన్నత అధికారులు, పచ్చ పార్టీ నాయకులు కలిసి అంగన్‌వాడీ పోస్టులను అమ్మకానికి పెట్టారు. అయితే ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తమ పరిధిలోని పచ్చ పార్టీకి చెందిన నాయకుల చుట్టు ప్రదక్షిణలు చేస్తుండగా, మరికొందరు ఐసీడీఎస్ ఉన్నత అధికారులను ప్రసన్నం చేసుకొనే పనిలో నిమఘ్నమయ్యారు. జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 43 అంగన్‌వాడీ

వేటపాలెం ప్రాజెక్టు పరిధిలో కింద ఉన్న ఉద్యోగ ఖాళీల వివరాలు..

చీరాల మున్సిపాలిటీ	చిన్నజాలమ్మ చెట్టు వద్ద	ఓసీ
చీరాల రూరల్	సాయినగర్	బీసీ బీ
చీరాల రూరల్	బోయినవారిపాలెం	బీసీ డీ
చీరాల రూరల్	బుర్లవారిపాలెం	బీసీ డీ
చీరాల రూరల్	ఓడరేవు	బీసీ ఏ
వేటపాలెం మండల పరిధిలో..		
దేశాయిపేట	ఆబోదినగర్	బీసీ బీ
దేశాయిపేట	విఘ్నేశ్వరకాలనీ	బీసీ బీ
దేశాయిపేట	నవజ్యోతికాలనీ	ఎస్టీ
కొత్తపేట	బజ్జార్ కాలనీ	ఎస్టీ
పందిళ్లపల్లి	లక్ష్మీపురం	బీసీ బీ

ఆయా ఉద్యోగాలకు సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటి కోసం ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు ఆఖరు తేదీగా ప్రకటించారు. వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చీరాల టౌన్, రూరల్, వేటపాలెం మండలాలు ఉన్నాయి.

ఉద్యోగాలకు కోసం పైరవీలు ప్రారంభం..

ఆయా కేంద్రాల్లో 10 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు 28 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయా గ్రామాల్లో ఉన్న పోస్టులకు పేదరికంతో అల్లాడుతూ జీవనోపాధి కోసం ఎదురు చూస్తున్న పలువురు అర్హులైన మహిళా అభ్యర్థులు ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఉద్యోగాలకు త్వరలో జిల్లా కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులో కొంత మంది వారికి అనుకూలమైన పచ్చపార్టీ చోటామోటా నాయకులతోనూ, జిల్లా ఐసీడీఎస్ ఉన్నత అధికారులతో పైరవీలు ప్రారంభించారు. అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు రూ.2 నుంచి 3 లక్షలు వరకు ధర నిర్ణయించినట్లు సమాచారం. గతంలో వేటపాలెం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు నుంచి పదోన్నతిపై అంగన్‌వాడీ కార్యకర్తగా వెళ్లడానికి జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఉన్నత అధికారులు రూ. 3 నుంచి రూ.5 లక్షలు వరకు తీసుకున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ ఉద్యోగాలు వారికి కాసులు కురిపిస్తాయని ఆశగా ఉన్నారు. అయితే పచ్చ పార్టీ నాయకులు తాము పోస్టులు ఇప్పిస్తామని అభ్యర్థులు బేరాలు కుదుర్చుకుంటున్నారని సమాచారం. అంగన్‌వాడీ ఉద్యోగాల్లో పచ్చపార్టీ నాయకులు మాటే శాసనం అన్నట్లు బేరసారాలు సాగుతున్నాయి. తాము చెప్పిన వారికే ఉద్యోగాలు కేటాయించాలని ప్రాజెక్టు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

మద్యం టెండర్లకు స్పందన కరువు

అద్దంకి రూరల్: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న కొత్త మద్యం పాలసీలో లాటరీ ద్వారా మద్యం షాపులకు దక్కించుకునేందుకు అద్దంకి నియోజకవర్గంలోని 23 షాపులకు శుక్రవారం రాత్రికి 345 దరఖాస్తులు అందినట్లు అద్దంకి డివిజన్ ఎక్సైజ్ సీఐ ఏ భవాని తెలిపారు. ఈ క్రమంలో అద్దంకి టౌన్‌లోని 5 షాపులకు 83, రూరల్ 2 షాపులకు 17, బల్లికురవ మండలంలోని 4 షాపులకు 54, కొరిశపాడు మండలంలోని 4 షాపులకు 71, జే పంగులూరు మండలంలోని 3 షాపులకు 67, సంతమాగులూరు మండలంలోని 5 షాపులకు 53 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు బాపట్లలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో లాటరీ నిర్వహిస్తారని తెలిపారు. 16వ తేదీ నుంచి నిర్వహిస్తారని చెప్పారు.

పర్చూరు (చినగంజాం): పర్చూరు నియోజకవర్గ పరిధిలోని పర్చూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలోని పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు మండలాల్లోని 15 వైన్ షాపులకు ఆన్‌లైన్ ద్వారా 445 దరఖాస్తులు అందినట్లు పర్చూరు ఎక్సైజ్ సీఐ ఎం భుజంగరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్చూరు మండలంలోని 4 షాపులకు 77, యద్దనపూడి మండలంలోని 2 షాపులకు 41, మార్టూరు మండలంలోని 6 షాపులకు 190, ఇంకొల్లు మండలంలోని 3 షాపులకు 137 దరఖాస్తులు అందినట్లు ఆయన వివరించారు. మార్టూరులో అత్యధికంగా 190 దరఖాస్తులు అందగా అతిస్వల్పంగా యద్దనపూడి మండలంలో 41 అందినట్లు తెలిపారు. చినగంజాం, కారంచేడు మండలాలు చీరాల ఎక్సైజ్ కార్యాలయంలో పరిధిలోకి రాగా చినగంజాం 3 షాపులకు 46 దరఖాస్తులు, కారంచేడులో 2 షాపులకు 57 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

చీరాల: మున్సిపాలిటీ, చీరాల రూరల్, వేటపాలెం మండలాల్లోని మొత్తం 19 మద్యం షాపులకు గాను 329 దరఖాస్తులు వచ్చాయని చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని 8 షాపులకు 116, చీరాల రూరల్‌లోని 6 షాపులకు 107, వేటపాలెం మండలంలోని 5 షాపులకు 106 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ చెప్పారు.

పేద విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ పంపిణీ


విద్యార్థికి ల్యాప్‌ట్యాప్ అందిస్తున్న దాతలు, గ్రామస్తులు

తిమిడెదపాడు (కారంచేడు): పేద విద్యార్థులకు బాసటగా నిలవాలనే లక్ష్యంగా ప్రారంభించిన 'మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వార అనేక మంది విద్యార్థులకు సాయం అందిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని తిమిడెదపాడు గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఎంసీఏ విద్యార్థి కందుకూరి దుర్గాప్రసాద్‌కు రూ.70 వేల విలువ చేసే ల్యాప్‌ట్యాప్ అందించారు. జన్మనిచ్చిన తల్లిని, బాధ్యతను నేర్పిన తండ్రిని, సంస్కారం నేర్పించిన గురవులను ఎప్పటికి మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఆనందరావు, లక్ష్మినారాయణ, మేనేజర్ సాయికిరణ్ సదాశివరావు, సర్పంచ్ బోడావుల బలరాం, శ్రీనివాసరెడ్డి, బోడావుల రంగనాయకులు, దండా నాగేశ్వరరావు, చుండి సుబ్బారావు, దండా చలపతిరావు, కట్టా వెంకటేశ్వర్లు, కట్టా హరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జయజయహే.. మహిషాసురమర్దిని


అద్దంకిలో మహిషాసురమర్దినిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరీ


పంగులూరు భీమలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారు..


మేదరమెట్లలో మహిషాసురమర్దిని అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు


మార్టూరు రుక్మాబాయి సమేత పాండురంగస్వామి ఆలయంలో అమ్మవారు


చినగంజాం కనకదుర్గాభవానీ ఆలయంలో అలంకరణలో అమ్మవారు


చెన్నుపల్లిలో మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు


జాగర్లమూడిలో మహిషాసురమర్దిని అలంకరణలో ఉజ్జయినీ మహంకాళే


కారంచేడులో గంగమ్మగుడిలో మహిషాసురమర్దినిగా అమ్మవారి దర్శనం

యద్దనపూడి/కారంచేడు/మార్టూరు/చినగంజాం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసురమర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లోకకంఠకుడైన మహిషాసురుడిని సంహారం చేసిన మహోగ్రరూపం ఇది. సకల దేవిదేవతల శక్తులన్ని ఈ తల్లిలో మూర్తిభవించి ఉంటాయి. దివ్య తేజస్సుతో అమ్మవారు సింహవాహినిగా పదిచేతుల్లో ఆయుధాలు ధరించి అపరాజితగా దర్శనమిస్తోంది. ఈరోజు అమ్మవారిని దర్శించి పూజించిన వారికి శత్రుభయం పోయి అన్నిటా విజయమే వరిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మహర్నవమిని పురస్కరించుకొని అమ్మవారిని మండలంలోని జాగర్లమూడిలోని ఉజ్జయినీ మహంకాళీ, పూనూరులోని త్రిపుర సుందరిదేవి, గన్నవరం కాశీఅన్నపూర్ణాదేవి ఆలయాల్లో అమ్మవారికి చండీహోమాలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

■ పర్చూరులోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్చూరు వైస్ ఎంపీపీ కోట ప్రసన్న, శ్రీనివాసరావు దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. నూతలపాడు గ్రామంలో దేవీ నవరాత్రులు సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని దేవి అవతారం భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలలో బొందలపాటి శేషిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. రాత్రి అవధూతేంద్ర భక్త భజన సమాజం అవనిగడ్డ వారిచే సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆదిపూడి మోహనకృష్ణ, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగంగుంట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

■ చినగంజాం మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసియున్న లలితా పరమేశ్వరీ రామకోటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దిని అవతారంలో అలంకరించారు. ఉభయ దాతలుగా ఘంటా రవికిరణ్, అశోక్ కుమార్, శ్రీనివాసరావు, ముంగర సురేష్‌బాబు, ముంగర అప్పారావు, పల్లపోలు నరేష్ బాబు, తుమ్మలపెంట సుధాకర్, కుర్రి వాసుదేవరావులు వ్యవహరించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ, రేల్వేస్టేషన్ సెంటర్‌లోని విజయకనకదుర్గాభవాని ఆలయం నందు అమ్మవారిని మహిషాసుర మర్దనిగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు.

■ కారంచేడు వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వేణుగోపాలస్వామి గుడి, పెదబజారు శివాలయం, హరేరామ విశిష్ట ఆశ్రమం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, సాయి మందిరం, కట్టమల్లేశ్వరస్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, గంగమ్మగుడి, శివాలయం, వల్లభరాయస్వామివారి ఆలయం, తిమిడెదపాడు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోను అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు.

వాడవాడలా అమ్మవారికి పూజలు..

అద్దంకి రూరల్/జేపంగులూరు/మేదరమెట్ల/బల్లికురవ: దసరా శరన్నవరాత్రులు వాడవాడలా ప్రతి ఇంటా ఘనంగా నిర్వహిస్తున్నారు. జే.పంగులూరు మండల పరిధిలోని పంగులూరు గ్రామంలోని స్వయంభుగా వెలసిన పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో దసరా పర్వదినం పురస్కరించుకొని దేవి నవరాత్రుల ఉత్సవాలు ఎంతో వైభంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజు అమ్మవారికి నవరాత్రుల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మహర్నవమి పర్వదినాన ఆకుపచ్చని వస్త్రం సమర్పించి, నైవేద్యంగా చెకెర పొంగలి సమర్పించాలి. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని ఓం నమశివాయ.. శ్రీమాతే నమః మంత్రం జపించారు.

■ మేదరమెట్ల కననదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థాంలో, రావినూతల కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలోని అమ్మవార్లను మహిషాసుర మర్దనిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ బల్లికురవ మండలం చెన్నుపల్లి సీతారామ స్వామి ఆలయం, గంగా పార్వతీ సమేత పరుశువేదీశ్వర స్వామి ఆలయం, కొండాయపాలెం నీలకంఠేశ్వర స్వామి ఆలయం, కొణిదన భవాని సమేత శంకర్ స్వామి ఆలయం, చిన అంబడిపూడి పార్వతి మల్లేశ్వరస్వామి ఆలయం, నక్క బొక్కలపాడు బల్లికురవ గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో, కొప్పరప్పాడు జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లకు విశిష్ట పూజలు, కుంకుమ పూజలు అలంకరణలు రాత్రికి భజనలు జరుగుతున్నాయి.

■ అద్దంకిలోని వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం, ధన్వంతరీ దత్త పాదుకా క్షేత్రం, పాత శివాలయం, వేయిస్తంభాల దేవాలయాల్లోని పార్వతీ అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

దుర్గాదేవీ నమోస్తుతే..

చీరాల అర్బన్: దసరా శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం చీరాల పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రులలో భాగంగా చీరాల, పేరాల శివాలయాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల పూలతో విశేష పూజలను నిర్వహించారు. దసరా ఉత్సవాలలో ప్రతిరోజు అమ్మవారిని విశేష అలంకరణలతో పూజలు నిర్వహిస్తున్నారు. అలానే చీరాల అమరావారివీధిలోని లక్ష్మీభవన సమాజంలో శరన్నవరాత్రులును ఘనంగా నిర్వహిస్తున్నారు. భద్రావతి సమేత భావనారుషిస్వామి దేవాలయం, సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి పార్వేట ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు తమకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శుభాలే కలగాలని కోరుకుంటూ జమ్మిచెట్టుకు ప్రార్థించి పూజలు నిర్వహిస్తారు. వాహనదారులు, ఆయా వృత్తుల వారు వారి వాహనాలను, పనిముట్లను పూజిస్తారు. నమ్మి జమ్మిచెట్టుకు పూజచేస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని ప్రజల విశ్వాసం.


పాపరాజుతోటలోని కామాక్షి అమ్మవారి దేవాలయంలో దుర్గాదేవిగా..


జాగర్లమూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అన్ని రంగాల్లో రాణిస్తున్న ఆడపిల్లలు

వేటపాలెం: ప్రస్తుత ప్రపంచంలో పురుషులతో సమానంగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి పీడీ, వేటపాలెం ప్రాజెక్టు సీడీపీఓ ఉమ పేర్కొన్నారు. స్థానిక స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవ అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. 'ఆడబిడ్డలను బతికిద్దాం.. ఆడబిడ్డలను చదివిద్దాం' అనే నినాదాలతో అవగాహన ర్యాలీ సాగింది. అనంతరం స్థానిక ఐసీడీఎస్ సమావేశంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆడపిల్లలే అన్ని రంగాల్లో ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. ఆడబిడ్డలను కాపాడుకోవావడానికి అందరం కృషిచేయాలని సూచించారు. ప్రతి బాలిక తప్పనిసరిగా చదువుకొని మంచి మహిళగా రాణించాని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ పుష్పవల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

యద్దనపూడి: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని జాగర్లమూడి గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పోస్టల్ పథకాలతో ఉపయోగాలు


పోస్టల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

పర్చూరు (చినగంజాం): పోస్టల్ సేవలు గ్రామాలకు కూడా విస్తరించాలని వైఆర్ హైస్కూల్ హెచ్ఎం ఈదర రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్‌టీఓ జీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోస్టల్‌శాఖలో ప్రజలకు ఉపయోగపడే సుకన్య సమృద్ధి యోజన, ప్రయాణ పత్రం లాంటి అనేక పథకాలు ఉన్నాయని ఆయన వివరించారు. వీటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పోస్టాఫీసులలోని ఆధార్ కేంద్రాలు గ్రామాలకు వెళ్లి ప్రజల ఆధార్ డేటాను ఆప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ వీరబ్రహ్మాచారి, సభ్యులు సీహెచ్ రమణ, బీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రామాల్లో పల్లె పండుగ

యద్దనపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేది వరకు జరిగే పల్లెపండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మహ్మద్ అబీబ్ జావెద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఆయా గ్రామాల్లో వరుస ప్రాధాన్యత క్రమంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసభల్లో 100 రోజుల పనిదినాలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించటమే కాక గ్రామాభివృద్ధికి సంబంధించిన పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. 14వ తేదీన వింజనంపాడు, శ్యామలవారిపాలెం, 15 అనంతవరం, సూరవరపుపల్లి, 16 చింతపల్లిపాడు, యద్దనపూడి, 17న జాగర్లమూడి, తనుబొద్దివారిపాలెం, 18 మన్నంగివారిపాలెం, పోలూరు, 19 చిమటవారిపాలెం, గన్నవరం, పూనూరు గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.

అద్దంకి రూరల్: ఈనెల 14 వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీ.సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.